వాకింగ్ పార్కులో సమస్యల తిష్ట

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాకర్స్



పార్కు ఆవరణలో పేరుకుపోయిన చెత్త



విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో తెల్లవారుజామున 5 గంటలకు అంధకారంలో పార్కు

మల్కాపురం: ఆరోగ్యం కోసం వాకింగ్ పార్కుకు వెళ్తున్న వాకర్స్‌కు పలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వద్ద వాకింగ్, సైకిలింగ్ పార్కు ఉంది. ఇక్కడికి మల్కాపురం, శ్రీహరిపురం, నక్కవానిపాలెం తదితర ప్రాంతాల నుంచి రోజూ వంద మందికి పైగా వాకర్స్ ఉదయం, సాయంత్రం వేళల్లో నడక కోసం వస్తుంటారు. ఇక్కడున్న విద్యుత్ ఎల్ఈడీ లైట్లు రోజూ సాయంత్రం 6 నుంచి మరుసటి రోజు తెల్లవారుజాము 4 గంటల వరకు మాత్రమే వెలుగుతుంటాయి. దీంతో వేకువజామున అంధకారంగా ఉంటోంది. పార్కులో చెట్ల కొమ్మలు పెరిగిపోవడంతో నడకకు ఇబ్బందవుతోంది. పార్కు పరిసరాలు కూడా చెత్త నిండిపోయి అధ్వానంగా తయారయ్యాయి. స్థానిక పారిశుధ్య కార్మికులు పార్కును శుభ్రం చేయడం లేదని వాకర్స్ ఆరోపిస్తున్నారు.



అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగిస్తున్న వాకర్స్

కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలి



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మల్కాపురం : ఎండల తీవ్రత విపరీతంగా ఉన్నందున వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారులు సూచించారు. సెక్రటరీ గ్రవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్టరీ లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ (న్యూఢిల్లీ), కమిషనర్ అఫ్ లేబర్ (ఏపీ) సంయుక్త ఆధ్వర్యంలో వడగాల్పులు, అధిక ఉష్ణోగ్రతలపై ఆయా విభాగాల అధికారులు మల్కాపురం సమీపాన పలువురు కార్మికులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్కిల్ – 1 కార్మిక శాఖ సహాయ కమిషనర్ మోహన్ లక్ష్మి, ఇతర అధికారులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయని, కార్మికులు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. అలాగే పలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ పరిశ్రమలు, పెద్ద భవనాలు నిర్మించే కాంట్రాక్టర్లు కార్మికుల కోసం రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉదయం పని గంటల్లో మార్పులు చేయాలని, తాగు నీరు, సేద తీరేందుకు విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని, అవసరమైతే ఆరోగ్య పరీక్షలు చేయించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన ఔషధాలు అందించాలని సూచించారు.

క్లుప్తంగా

ఎర్నిమాంబ ఉత్సవాలకు ఏర్పాట్లు



అమ్మవారి మాలధారణ భక్తులతో గురుస్వామి నూకరాజు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ జాతరలో భాగంగా గురుస్వామి బంటుపల్లి నూకరాజు నేతృత్వంలో గురువారం భక్తులు మాలధారణ చేశారు. ఎర్నిమాంబకు క్షీరాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, కుంకుమపూజలు, విశిష్ట పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరణ చేశారు. శనివారం జరిగే తొలేళ్లు, ఆదివారం జరిగే ప్రధాన జాతరకు దేవదాయ ధర్మదాయ శాఖ కమిటీ ప్రతినిధులు, సంక్షేమ సంఘం సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో రమణమూర్తి, మహాలక్ష్మి, జి.లక్ష్మణ్, పి.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంలో పాదచారులకు మజ్జిగ అందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం మూడు గుళ్ల వద్ద చలివేంద్రాన్ని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు గురువారం ప్రారంభించారు. స్థానికులకు మజ్జిగ, మంచినీరు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవాన్ రమణ మహర్షి భక్తుడు వంజిరపు రామకృష్ణ ఆర్థిక సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఏటా చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజా సేవ చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో 91, 92 వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, గేదెల మురళీకృష్ణ, దవళ గోపాల్, గొంతెన నాగరాజు, నీలాపు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్క్ అభివృద్ధి పనుల పరిశీలన



శాంతినగర్ పార్క్‌లో పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ పార్క్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం పరిశీలించారు. పార్కులో పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన నేచురల్ గ్రీన్ మేట్‌లు చూశారు. ఇందులో మొక్కలు ఏ విధంగా నాటాలో సిబ్బందికి సూచనలు చేశారు. పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని తెలిపారు. వార్డులోని పార్కులను అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. నాణ్యతాలోపాలు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు.

ఆకట్టుకున్న హస్తకళా ప్రదర్శన

మల్కాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో చిన్నారులు గురువారం ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ ఆధ్వర్యంలో చిన్నారులు లైట్‌హౌస్, సోలార్ గ్లాస్‌తో ఇల్లు, గ్రీన్ హౌస్, ఫేస్‌ఫ్రేమ్, ఫొటోఫ్రేమ్ ఇలా తదితర నమూనాలు రూపొందించి ప్రదర్శనలో ఉంచారు. వీటిని అతిథులు సందర్శించి విద్యార్థులను అభినందించారు. రీసోర్స్ పర్సన్స్‌గా ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి వై.అనసూయాదేవి, లావణ్య, అలేఖ్య వ్యవహరించారు. అనంతరం కార్మిక నాయకుడు బి.సత్యానందం విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. కె.సత్తిరాజు, జాతీయ సేవా పథకం జిల్లా ప్రొగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ చట్టంపై శిక్షణ తరగతులు

కంచరపాలెం: స్థానిక ఐటీఐ జంక్షన్‌లోని జిల్లా వినియోగదారుల సంఘం సమైక్య కార్యాలయంలో సంఘ చైర్మన్ మర్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం వినియోగదారుల రక్షణ చట్టంపై సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఏయూ రిటైర్డ్ వీసీ ఆచార్య లజపతిరాయ్, బీఐఎస్ సైంటిస్ట్ సంధ్య మాట్లాడుతూ సమాజంలో వినియోగదారులు ఎలా మోసపోతున్నారో తెలుసుకోడానికి కొన్ని సంస్థలను ఎంపిక చేసి సర్వే రిపోర్ట్‌ను ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. కోర్టు అంటే భయపడే వారు, చదువురాని వారికి వినియోగదారుల సంఘం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే వినియోగదారుల రక్షణ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో బీఐఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి బీఐఎస్ బ్యాచ్ నంబర్ చెక్ చేసుకుని వస్తువులు కొనుగోలు చేయాలని ట్రైనింగ్ ఇచ్చారు. వినియోగదారుల సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఫెడ్కో చైర్మన్ సత్యనారాయణ తెలిపారు.

కిషన్‌రెడ్డికి సాదర స్వాగతం



విశాఖ విమానాశ్రయం నుంచి వస్తున్న కిషన్ రెడ్డి

గోపాలపట్నం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి ఎయిరిండియా విమానంలో గురువారం విశాఖ వచ్చిన ఆయనకు బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి ఆయన నగరంలోకి రోడ్డు మార్గాన వెళ్లారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం , కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

విజేతలకు వీసీ అభినందన



విజేతలకు సర్టిఫికెట్లు బహూకరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉన్నత్ భారత్ అభియాన్ రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో అభినందించారు. ఉన్నత భారత్ అభియాన్ లక్ష్యాలకు అనుగుణంగా కళాశాలల వారీగా ఈ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, యూబీఏ నోడల్ అధికారి ఆచార్య జి.నాగరాజు, ప్రాంతీయ సమన్వయకర్త బి.పావని, డాక్టర్ సోనీ హవీల, ఆచార్య ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే ఉక్కు పరిరక్షణ

కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ సంస్థల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధిస్తుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఇందు కోసం రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఏకమై ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకోవాలని కోరారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు గురువారానికి 826వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సీఎంఎం, సీఆర్ఎంపీ, సీఈడీ, లూబ్రికేషన్ అండ్ ఫ్యాబ్రికేషన్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని, ఇది దుర్మార్గమైన చర్య అని అన్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిరంకుశత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రవాణా రంగాన్ని కాపాడాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట: ప్రజలపై ఆర్థిక భారాలు వేసే జీవో నంబర్ 31ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ గురువారం అక్కయ్యపాలెం కూడలిలో నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గూడ్స్ లారీలు, ప్రైవేట్ బస్సులు, వ్యాన్లు, కార్లపై భారీగా పన్నులు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 31ని రద్దు చేసి రవాణా రంగాన్ని కాపాడాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి కింద ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని లారీలు, వ్యాన్లు, కార్లు, జీపులు కొనుగోలు చేసి ప్రజలకు సేవలందిస్తూ ప్రభుత్వానికి కోట్లాది రూపాయాల పన్నులు చెల్లిస్తున్న వాహన యజమానులకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. మరో పక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపు, జీఎస్టీ పన్నులతో రవాణా రంగం కుదేలవుతోందన్నారు. జీవో రద్దు చేయని పక్షంలో ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రావికృష్ణ, శివ, కె.రాము, జి.శ్రీను, అప్పలరాజు పాల్గొన్నారు.

కార్పొరేటర్ సురేష్‌పై చర్యలకు దళిత సంఘాల డిమాండ్



మాట్లాడుతున్న పారిశ్రామిక ప్రాంత దళిత సంఘాల ప్రతినిధులు

మల్కాపురం: తమ బతుకుదెరువపై దెబ్బకొడుతున్న 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్‌పై చర్యలు తీసుకోవాలని పలు దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం చింత చెట్టు కింద బ్యాగులు కుట్టుకుని జీవనం సాగిస్తున్న ములగాడ రాజు అనే వ్యక్తి షాపుతో పాటు అందులో ఉన్న రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటాలను తొలగించారు. దీనికి కార్పొరేటర్ పి.వి.సురేషే కారణమని ఆరోపిస్తూ తొలగించిన షాపు వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరులతో దళిత సంఘం నాయకుడు కాకర రమణ మాట్లాడుతూ సురేష్‌కు తమ దళిత సామాజిక వర్గం అంటే చులకన అని విమర్శించారు. కార్పొరేటర్ అన్న అహంకారంతో సురేష్ బ్యాగులు కుట్టుకుని జీవనం సాగిస్తున్న రాజుపై పలుమార్లు దురుసుగా ప్రవర్తించడమే కాకుండా కులం పేరుతో దూషించారన్నారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తమ వర్గం ప్రజలపై అభిమానం చూపించారని, దుకాణం కోల్పోయిన రాజుకు అండగా నిలిచారని చెప్పారు. ఆర్థిక సాయం చేసి రాజు కుటుంబం రోడ్డున పడకుండా ఆదుకున్నారన్నారు. కార్పొరేటర్ సురేష్ తన అనుచరులతో కలిసి పలు అనధికారిక వసూలుకు పాల్పడుతున్నారని ఆరోపించారు. త్వరలో వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కింతాడ రాజశేఖర్, గుడాల బాబూరావు, సైదా సుదర్శన్, పెద్దాడ రమణ, భీమ్‌జీ, లక్ష్మి, త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ వేసవి శిబిరాల పోస్టర్ ఆవిష్కరణ

మద్దిలపాలెం: ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ వీసీసీ వేసవి శిక్షణా శిబిరాల పోస్టర్‌ను గురువారం పిఠాపురం కాలనీ పార్కులో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మధు బొర్రా, రొటేరియన్ మోదంబికా, వీసీసీ క్లబ్ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె.రమాప్రభ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాప్రభ మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకూ మూడు రోజుల పాటు అనకాపల్లి జిల్లా తిమ్మరాజుపేటలోని డావిన్సి ఇంటర్నేషనల్ స్కూల్‌లో వేసవి శిబిరాలు నిర్వహించనున్నామన్నారు. ఈ శిబిరాలను 8, 9, 10 తరగతుల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భావ వ్యక్తీకరణ, సమాజంలో కుటుంబాల సమూహాల గురించి అవగాహన కల్పించనున్నామన్నారు. పూర్తి వివరాలకు 83098 12422, 93989 70538 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రెజ్లర్లను వేధించిన ఎంపీపై చర్యలకు డిమాండ్



మండల పరిషత్ కూడలిలో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

పరవాడ: క్రీడాకారులను లైంగికంగా వేధించిన రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కూడలిలో ప్రజా సంఘాల నాయకులు గురువారం నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఢిల్లీలో 25 రోజులుగా మహిళ రెజ్లర్లు తమపై జరిగిన లైంగిక వేధింపులకు నిరసనగా జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్నారని.. అయినా స్పందించక పోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తిరిగి క్రీడాకారులపైనే దాడులు చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. పోక్సో, నిర్భయ చట్టాలను అమలు చేసి బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో క్రీడాకారులకు అండగా జరిగే ఆందోళనలకు ప్రతి ఒక్కరు కలిసి రావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకర్రావు, జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.రమణమూర్తి పిలుపునిచ్చారు.

పాలిటెక్నిక్ ప్రవేశాల కమిటీలో గైస్ ప్రిన్సిపాల్

మురళీనగర్ (విశాఖ ఉత్తర): 2023 పాలిసెట్ అడ్మిషన్ కమిటీలో విశాఖపట్నం గవర్నమెంట్ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే వెంకటరమణకు అవకాశం కల్పించారు. పాలిటెక్నిక్‌లో చేరే అభ్యర్థుల ఎంపికలో ఈయన బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

అలరించిన గాత్ర కచేరీ

ఉక్కునగరం: స్థానిక స్టీల్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన గాత్ర కచేరీ ఆహూతులను అలరించింది. శృతి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ఈ కచేరీలో ప్రముఖ విద్వాంసులు, విజయనగరం సంగీత కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎ. నారాయణ గాత్ర మాధుర్యంతో శ్రోతలను ఆనంద డోలికల్లో ముంచెత్తారు. వయొలినిస్టు నీలాద్రిరావు, మృదంగం వాద్యకారుడు ఏడుకొండలు సహకారం అందించారు. అనంతరం వారిని శృతి, స్టీల్‌క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. అంతకు ముందు స్టీల్ ప్లాంట్ జీఎం (మెకానికల్) పి.ఎస్. ఘోష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా దాసరి ప్రతిభా అవార్డు గ్రహీత, సినీ దర్శకుడు డి. దివాకర్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో శృతి కార్యదర్శి ఎస్. రమణారావు, స్టీల్‌క్లబ్ కార్యదర్శి నారాయణ దొర, కె. శ్రీనివాస్, కె. సత్యనారాయణ, కె.ఎల్. నరసింహం తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్ ఖాళీ చేస్తేనే ఎస్ఏబీఎఫ్ పెన్షన్

- స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగుల్లో ఆగ్రహం
- కార్మిక సంఘాల వైఖరిపై అసహనం



ఉక్కునగరం: ఉక్కునగరంలో నివసిస్తూ రిటైర్ అయిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు సూపర్ యాన్యుయేషన్ బెనిఫిట్ ఫండ్ (ఎస్ఏబీఎఫ్) పెన్షన్ నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఉద్యోగులను బలవంతంగా ఎస్ఏబీఎఫ్‌లోకి పంపడంతో పాటు క్వార్టర్ ఖాళీ చేసే వరకు పెన్షన్ చెల్లించకుండా నిలిపివేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతుంది. ఈ అంశంపై కార్మిక సంఘాల వైఖరిపై రిటైర్డ్ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, యాజమాన్యం వాటాలతో 1995లో ఎస్ఏబీఎఫ్ ఏర్పడింది. ఉద్యోగులు రిటైర్ అయినప్పుడు ఎస్ఏబీఎఫ్ నగదు మొత్తాన్ని ఉద్యోగులకు చెల్లించేవారు. 2020 ఏప్రిల్‌లో కరోనా కాలంలో ఎస్ఏబీఎఫ్‌లో దాచుకున్న లక్షలాది రూపాయలను కొత్త పెన్షన్ స్కీంకు బదిలీ చేశారు. పెన్షన్ స్కీమ్‌లో చేరాలా, వద్దా అనే ఆప్షన్ ఉద్యోగులకు ఇవ్వకుండా ఏకపక్షంగా అందరినీ పెన్షన్ స్కీమ్‌లో చేర్చేశారు. ఆ ఎస్ఏబీఎఫ్ నగదు కూడా కార్పొరేట్ సంస్థల్లో డిపాజిట్ చేసి, పెన్షన్ ఇచ్చేలా ఒప్పందం చేశారు. ఉద్యోగులు డిపాజిట్ చేసే నగదుపై 1.8 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు ఉద్యోగి రూ. 10 లక్షలు డిపాజిట్ చేస్తే జీఎస్టీగా రూ. 18 వేలు సర్వీసు ప్రొవైడర్లు వసూలు చేస్తున్నారు. అంటే ఉద్యోగి దగ్గర 5 నెలల పెన్షన్ నగదు జీఎస్టీ రూపంలో తీసుకుంటున్నారు. ఇది ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది.

ఇదిలా ఉండగా ఉక్కునగరంలో నివాసం ఉంటున్న ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత 4 నెలల వరకు తమకు కేటాయించిన క్వార్టర్‌లో ఉండవచ్చు. ఇందు కోసం యాజమాన్యం ఉద్యోగి ఫైనల్ సెటిల్‌మెంట్ నుంచి రూ. 50 వేల నుంచి రూ. లక్షా యాభై వేలు వరకు ఉంచుకుని, ఉద్యోగి క్వార్టర్ ఖాళీ చేసిన వెంటనే డిపాజిట్ చేసిన నగదును తిరిగి చెల్లించేవారు. ప్రత్యేక పరిస్థితుల్లో కార్మికులు రెండేళ్ల వరకు క్వార్టర్‌లో ఉండే అవకాశం ఉంది. అయితే గత మూడు నెలలుగా రిటైర్డ్ ఉద్యోగుల ఎస్ఏబీఎఫ్ నగదును సర్వీస్ ప్రొవైడర్లకు ఇవ్వకుండా నిలుపుదల చేశారు. తద్వారా ఉద్యోగులు క్వార్టర్ ఖాళీ చేసే వరకు పెన్షన్ కూడా ఇవ్వడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రస్తుత గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, గత గుర్తింపు సంఘం సీఐటీయూ, ప్రతిపక్ష సంఘం ఐఎన్‌టీయూసీ నాయకుల పట్టించుకోకపోవడంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుర్తింపు సంఘం స్పందించాలి



ఎస్ఏబీఎఫ్‌పై కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై గుర్తింపు సంఘం స్పందించాలి. ఎస్ఏబీఎఫ్‌లో చేరికపై ఉద్యోగులకు ఆప్షన్ ఇవ్వాలి. క్వార్టర్ ఖాళీ చేసే వరకు పెన్షన్ నిలిపివేయడం అన్యాయం. క్వార్టర్ ఖాళీ విషయంలో పాత పద్ధతి కొనసాగించి కార్మికులకు ఎస్ఏబీఎఫ్ పెన్షన్ రిటైర్ అయిన వెంటనే చెల్లించేలా యాజమాన్యంపై ఒత్తిడి తేవాలి. గత గుర్తింపు సంఘం సీఐటీయూ, ప్రస్తుత గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీల వల్లే కార్మికులకు ఈ పరిస్థితి తలెత్తింది.

–నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకుడు

బోదకాలు వ్యాధి నియంత్రణపై అవగాహన

మద్రిపాలెం: జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గురువారం బోదకాలు వ్యాధి(ఫైలేరియా) పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 51వ వార్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాధవధార మాధవస్వామి కల్యాణ మండపంలో అంబేడ్కర్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో వ్యాధికి సంబంధించి అన్ని విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగాన్ని దృష్టిలో పెట్టుకుని అందరికీ ఉచిత వైద్యం అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం బోదకాలు వ్యాధిగ్రస్తులను గుర్తించి, నాలుగో స్టేజీలో ఉన్నవారికి కిట్లు, రూ.5 వేల పెన్షన్ అందిస్తోందని చెప్పారు. గత ప్రభుత్వాలు పెన్షన్లు, కిట్లు ఇవ్వలేదని గుర్తు చేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక సచివాలయాల్లో ఉన్న ఏఎన్ఎంలు, యూపీహెచ్‌సీ కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశా వర్కర్ల ద్వారా బోదవ్యాధిగ్రస్తులను గుర్తించి తక్షణమే వారికి వైద్య సదుపాయం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జోన్-5 నోడల్ ఆఫీసర్ నాగశ్రీను, ఆర్‌వీ లోక్‌నాథ్, ఎం.కృష్ణమోహన్, నాగరాజు, కిషోర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు శ్యామ్, గణేష్, వినోద్ పాల్గొన్నారు.